క్లుప్తంగా

దుర్గమ్మ సన్నిధిలో పూజలు

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ విజయ దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని బుధవారం కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ వ్యవస్థాపకులు మల్లిఖార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్ వారికి స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. అర్చకులు హారతులు ఇచ్చి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొక్కు తీర్చుకోవడంలో భాగంగా తాము అమ్మవారిని దర్శించుకున్నట్లు తెలిపారు.

అగ్నిపథ్‌ను రద్దు చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: దేశ భద్రతా వ్యవస్థను దెబ్బ తీసే అగ్ని పథ్ పథకాన్ని వెంటనే రద్దు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.దస్తగిరి డిమాండ్ చేశారు. దేశవ్యాప్త ఆందోళన లో భాగంగా బుధవారం నగరంలోని లక్ష్య అకాడమీ వద్ద ఆర్మీ లో చేరే విద్యార్థులతో ఆందోళనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భద్రత విషయం లో ఇంతటి అనాలోచిత నిర్ణయం సరైంది కాదని, వెంటనే అగ్ని పథ్ పథకాన్ని రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రాహుల్ దేవ్, నగర నాయకులు నాగార్జున, మహేంద్ర, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జాకు అడ్డుకట్ట వేయాలి

కడప రూరల్ : భూ కబ్జాకు పాల్పడుతున్న వారిపై చర్యలు చేపట్టి తమకు న్యాయం చేయాలని నూనె రాజేశ్వరి అనే మహిళ కోరారు. బుధవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గోపవరం మండలంలో తమకు 2.54 సెంట్ల భూమి ఉందన్నారు. కొంతమంది తమ భూమి ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

క్రమశిక్షణతో చదవాలి



మాట్లాడుతున్న జడ్జి బాబా ఫక్రుద్దీన్

కడప రూరల్ : క్రమశిక్షణతో చదివితే విద్యావేత్తలుగా ఎదగవచ్చని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ సూచించారు. బుధవారం స్థానిక ప్రకాశ్‌నగర్‌లోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో విజిట్, న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. చదివిన సంస్థకు, తల్లిదండ్రులకు మంచి పేరును తీసుకు రావాలని తెలిపారు. బాలల సంరక్షణకు స్నేహ పూర్వక న్యాయ సేవలు పథకం -2015 గురించి వివరించారు. పిల్లల విద్య, ఆరోగ్య విషయాల పట్ల తగు జాగ్రత్తలు వహించాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ ఆఫీసర్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

చెన్నూరు : మండలంలోని ముండ్లపల్లె ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులందరికీ నోట్ బుక్కులు, పాఠ్యపుస్తకాలను మండల విద్యాశాఖ అధికారి గంగిరెడ్డి ఎంఈఓ-2 సునీత చేతుల మీదుగా బుధవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులందరూ క్రమశిక్షణతో విద్యాభ్యాసాన్ని కొనసాగించాలని, అలాగే విద్యార్థులకు ఏవైనా నోట్ బుక్కులు, పాఠ్య పుస్తకాలు, షూస్, బ్యాగ్స్ వంటి విద్యా సామాగ్రి ఏవైనా అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. విద్యార్థులందరికీ మెనూతో కూడిన భోజనం అందించాలని, పాఠశాల ఆవరణం పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రధాన ఉపాధ్యాయులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.చిన్నపరెడ్డి, నిర్మలా దేవి పాల్గొన్నారు.

టెట్ ఫలితాల్లో ప్రతిభ



మేకల గోవర్ధన్



గురు మౌనిక

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి ఫిబ్రవరి 27 నుంచి మార్చి 5వ తేదీ వరకు నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) ఫలితాల్లో కడప వెంకటసాయి కోచింగ్ సెంటర్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి తమ ప్రతిభను చాటారు. ఇందులో కడపకు చెందిన మేకల గురయ్య (హెడ్ కానిస్టేబుల్) కుమారుడు మేకల గోవర్ధన్ సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్జీటి) అర్హత పరీక్ష పేపర్-1లో 150 మార్కులకు 137.05 మార్కులను సాధించాడు, అలాగే బ్రహ్మంగారిమఠం మండలం ముడమాలకు చెందిన వ్యవసాయ రైతు పెద్దబోయిన గురువయ్య కుమార్తె పెద్దపోయిన గురు మౌనిక సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్జీటి) అర్హత పరీక్ష పేపర్-1లో (ఎస్జీటి)లో 150 మార్కులకు 136.57 మార్కులను సాధించింది. ఉత్తమ మార్కులు సాధించిన వీరిరువురిని వెంకటసాయి కోచింగ్ సెంటర్ అధినేత టక్కోలి దామోదర్‌రెడ్డి అభినందించారు.

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్



సమావేశానికి హాజరైన కళాశాల విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్ : నేటి యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ బాగా చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చి మంచి పేరును తెచ్చుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ పేర్కొన్నారు. బుధవారం కడప బాలాజీనగర్‌లోని యస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని న్యూ మాడ్యుల్ లీగల్ సర్వీసెస్ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ(నల్సా) వారి ట్రాఫికింగ్, లింగ నిష్పత్తి, లింగ సమానత్వం, ప్రాథమిక హక్కులు, విధులు, విద్యాహక్కు, లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్ట్ 1987, 357 ఏసిఆర్ పీసీ, బాల్య వివాహాలు, పోక్సో చట్టం, శిశు సంక్షేమ కమిటీ విధులు తదితర చట్టాల గురించి తెలియచేశారు. అనంతరం కళాశాల ఆవరణలో డిస్ట్రిక్ ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్, వన్‌స్టాప్ సెంటర్, వైద్య ఆరోగ్యశాఖ, డ్రగ్స్ డిపార్టుమెంట్, దిశా పోలీసులు, భారతరత్న మహిళా మండలి ఉజ్వల హోమ్ అండ్ స్వాడర్ వారు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను జిల్లా అధికారులు, ప్రొఫెసర్లు, లెక్చరర్లు, పారా లీగర్ వాలంటీర్లు, ఎన్జీవోలు, న్యాయవాదులు, విద్యార్థులు సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు, అసిస్టెంట్ డైరెక్టర్ డ్రగ్స్ కంట్రోల్ డిపార్టుమెంట్ సిహెచ్ నాగ కిరణ్‌కుమార్, డిస్ట్రిక్ ప్రోగ్రాం మేనేజర్ భాస్కర్, దిశా సబ్ ఇన్‌స్పెక్టర్ నస్రీన్, వన్‌స్టాప్ సెంటర్ ఏపీ అశ్వని, ప్రెసిడెంట్ భారతరత్న మహిళా మండలి ఉజ్వల హోమ్ అండ్ స్వాడర్ నిర్వాహకులు సరస్వతి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ సాంబశివరావు, డిప్యూటీ చీఫ్ లీగలైట్ డిఫెన్స్ కౌన్సిల్ శాంత, అసిస్టెంట్ లీగల్ ఏ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్, యస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్‌వి సుదర్శన్‌రెడ్డి, పారా లీగల్ వాలంటీర్లు దశరథ రామిరెడ్డి, శ్రీనివాసులు, విష్ణు, శిరీష్, ఎన్జీవోలు, ప్రొఫెసర్లు, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోపాల్ పేర్కొన్నారు. బుధవారం అంతర్జాతీయ మాదక మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నగర శివార్లలోని ఊటుకూరులోని పి. రామిరెడ్డి ఫార్మసీ కళాశాలలో విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి యువత వెన్నెముక అని, పొరపాటున కూడా మత్తు పదార్థాల జోలికి వెళ్లకూడదన్నారు. జీవితంలో విద్యార్థులు ఉన్నత స్థాయికి రావాలంటే చెడు వ్యసనాలకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్ క్రిష్ణకుమార్, కళాశాల ప్రిన్సిపల్ నీల్సన్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

వైవీయూ : యువత మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వేమల సలీంబాషా సూచించారు. బుధవారం కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, ఉమన్ ఎంపవర్‌మెంట్, స్టెప్, పోలీసుశాఖల సంయుక్త ఆధ్వర్యంలో 'అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం' నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యువత చెడుమార్గానికి దారితీసే డ్రగ్స్ సంస్కృతికి చరమగీతం పాడాలన్నారు. ప్రతి ఒక్కరిలో డ్రగ్స్‌పైన అవగాహన పెంపొందించడం ద్వారా వాటిని అరికట్టవచ్చన్నారు. స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్ మాట్లాడుతూ యువత హెరాయిన్, కొకెయిన్, ఆల్కాహాల్ వంటి మత్తు పదార్థాలకు బానిసై, చెడు అలవాట్లు నేర్చుకుంటే భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. యువతలో అవగాహన కల్పించేందుకు యువజన సర్వీసులశాఖ కృషి చేస్తోందన్నారు. డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ అధికారులు మాదక ద్రవ్యాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. పి. గురువిరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. జి. విజయలక్ష్మి, డా. పి. శచీదేవి, ఎన్‌సీసీ అధికారి డా. బి. స్వరూప, ఉమన్ ఎంపవర్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ నాగరత్నమ్మ, స్టెప్ మేనేజర్ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాదక ద్రవ్యాల పై అవగాహన కల్పించే పోస్టర్లతో అధ్యాపకులు, అధికారులు

29న లోక్ అదాలత్

కమలాపురం : స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో ఈ నెల 29న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు మెజిస్ట్రేట్ లావణ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్, క్రిమినల్, బ్యాంక్ కేసుల్లో రాజీ ధోరణిలో ఉన్న కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ కేసులను పరిష్కరించుకోవచ్చని ఆమె అందులో పేర్కొన్నారు. కోర్టు పరిధిలోని పోలీస్ సిబ్బంది కేసుల పరిష్కారం కోసం తమ వంతు ప్రయత్నం చేయాలని మెజిస్ట్రేట్ తెలిపారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో 55శాతం ఉత్తీర్ణత

లింగాల : లింగాల మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షల్లో 55శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపల్ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. 20 మంది విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాయగా 11 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు.

ముగిసిన వేలంపాట

ముద్దనూరు : స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ ఆదాయానికి గాను నిర్వహించిన వేలంపాట బుధవారం ముగిసింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి బస్టాండు నిర్వహణకు పంచాయతీ రూ.8లక్షల 25వేలు నిర్ణయించింది.ఈ వేలంపాటలో రూ.8లక్షల26వేలకు వినోద్ బస్టాండు నిర్వహణను దక్కించుకున్నట్లు, రూ.1లక్షా32వేలకు నిర్ణయించిన జంతువధశాలను రూ.1లక్షా33వేలకు రామలక్షుమ్మ దక్కించుకున్నట్లు ఇంచార్జి కార్యదర్శి వీరభద్రుడు తెలిపారు. సులభ్ కాంప్లెక్స్ వేలంపాట వాయిదా పడినట్లు ఆయన పేర్కొన్నారు.

వ్యాకరణంలో మేటి 'కోవెల'

కడప కల్చరల్ : అలంకారం, ఛందస్సు తదితర వ్యాకరణ అంశాల్లో సాహితీవేత్త ఆచార్య కోవెల సంపత్కుమారాచార్య మేటిగా నిలిచారని హైదరాబాదు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యాపకులు ఆచార్య వి.త్రివేణి పేర్కొన్నారు. బుధవారం యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆచార్య కోవెల సంపత్కుమారాచార్య 82వ జయంతిని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆచార్య కోవెల రాసిన తెలుగు ఛందో అలంకార శాస్త్ర గ్రంథానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు లభించిందని గుర్తుచేశారు. ఆచార్య కోవెల ..వ్యాకరణ, ఛందో గ్రంథాలను, విమర్శను, ఖండకావ్యాలను, సాహిత్య చరిత్రను, శతకాలను, ప్రాచీన గ్రంథాల పరిష్కరణలను, విపులమైన పీఠికలను, నాటికలను రాశారన్నారు. ఆయన రచించిన గ్రంథాలను ఉదహరించి, వాటి ప్రత్యేకతల గురించి వివరించారు. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య టి.రామప్రసాద రెడ్డి, యోగివేమన విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యాపకులు ఆచార్య పి.రమాదేవి మాట్లాడారు. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు భూతపురి గోపాల కృష్ణశాస్త్రి, చింతకుంట శివారెడ్డి, గ్రంథాలయ సహాయకులు జి.హరిభూషణరావు పాల్గొన్నారు.

నిత్యపూజకోన నూతన రోడ్డుకు ప్రతిపాదన

కడప కల్చరల్ : జిల్లాలోని సుప్రసిద్ధ అటవీ పుణ్యక్షేత్రమైన శ్రీ నిత్యపూజస్వామి కోనకు నూతన రహదారి నిర్మించేందుకు రోడ్లు భవనాలశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు షేక్ షాషావలీ జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపారని తాళపత్ర గ్రంథ పరిశోధకులు నాగదాసరి మునికుమార్ తెలిపారు. సిద్ధవటం నుంచి ప్రస్తుతం నిత్యపూజకోనకు ఉన్న రహదారి స్థానంలో మరో పక్కా రోడ్డు నిర్మించాలని, అందుకు తగిన భూమిని అటవీశాఖ నుంచి తీసుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు. శ్రీ లంకమల్లేశ్వర అభయారణ్యంలో ఈ రోడ్డు వేయాల్సి ఉన్నందున అటవీశాఖ అనుమతి తప్పనిసరి అన్నారు. సీఏ ల్యాండ్‌కు అవసరమైన రెవెన్యూ ల్యాండ్‌ను ఆ శాఖకు కేటాయించాలని జిల్లా కలెక్టర్‌కు రోడ్లు భవనాలశాఖ అధికారి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. బుధవారం దీనికి సంబంధించిన సమావేశం ఆర్అండ్‌బీ కార్యాలయంలో జరిగినట్లు మునికుమార్ తెలిపారు.

రోగులతో ఆస్పత్రి కిటకిట

ఎర్రగుంట్ల : ఇటీవల కురిసిన వర్షాలకు పలు ఏరియాలలో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. దీంతో పట్టణ, గ్రామీణ హెల్త్ కేంద్రాలలో రోగులతో కిక్కిరిసి పోతున్నాయి. బుధవారం స్థానిక పీహెచ్‌సీలో, అర్బన్ హెల్త్ కేంద్రంలో రోగుల సంఖ్య అధికమైంది. ఆయా ఆసుపత్రి వైద్యాధికారులు డాక్టరు జ్యోత్స్న డాక్టరు శ్రీనాథ్‌రెడ్డి రోగులకు వైద్య పరీక్షలు వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రతి రోజూ జ్వరం, వాంతులతో బాధపడుతున్న వారు అధికంగా వస్తున్నారని వైద్యులు తెలిపారు.

అంధులకు దుప్పట్లు పంపిణీ



అంధులకు దుప్పట్లను పంపిణీ చేస్తున్న వెంకట రమణారెడ్డి

పులివెందుల టౌన్ : పట్టణంలోని కచేరి రోడ్డులో ఉన్న శ్రీ వీరనారాయణ స్వామి అంధుల ఆశ్రమంలో బుధవారం అంధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. సంగిరెడ్డి అంకిరెడ్డి, మంగమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు వెంకట రమణారెడ్డి అంధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఆశ్రమ నిర్వాహకులు రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకే నియామకాలపై విచారణ చేపట్టాలి



కలెక్టరేట్ పరిపాలన అధికారి విజయ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఓబులేశు యాదవ్

కడప సెవెన్‌రోడ్స్ : ఆర్బీకేల సిబ్బంది నియామకాల్లో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టాలని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎం ఓబులేశుయాదవ్ కోరారు. బుధవారం కలెక్టరేట్ పరిపాలన అధికారి విజయ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఆర్బీకే సిబ్బంది నియామకాలకు సంబంధించి కడప వ్యవసాయశాఖ కార్యాలయంలో దస్త్రం మాయం కావడంపై పలు అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. నిబంధనలను అనుసరించి నియామకాలు జరగలేదన్నారు. ఇందువల్ల అర్హులకు అన్యాయం జరిగిందని తెలిపారు. దస్త్రం మాయంపై విచారణ జరిపి అందుకు కారకులైన వ్యవసాయశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డిసాయి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చైతన్య రెడ్డి

కమలాపురం : ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణ చైతన్యరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ గండి భారతి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా వర్షాకాలం కావడంతో వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. మంచినీటి ఎద్దడి నెలకొనకుండా చర్యలు చేపట్టాలన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు కలసి మండల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పలు గ్రామాల్లో ఉన్న సమస్యల గురించి ఆయన అధికారులతో చర్చించి వాటిని పరిష్కరించాలని సూచించారు. వైస్ ఎంపీపీ చెన్నకేశవరెడ్డి, జడ్పీటీసీ సుమిత్రా, మండల స్పెషలాఫీసర్ నరసింహారెడ్డి, ఎంపీడీఓ జ్యోతి, తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, అధికారులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన ఉత్పత్తులు అందించండి

రైతులకు ప్రభుత్వం నుంచి వస్తున్న నాణ్యమైన ఉత్పత్తులను అందించాలని ఎమ్మెల్యే చైతన్యరెడ్డి తెలిపారు. స్థానిక ఏడీఏ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని వ్యవసాయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. వ్యవసాయ సిబ్బంది రైతులకు నిత్యం అందుబాటులో ఉండి సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించి సాగుకు సహకరించాలన్నారు. రైతు సంఘం నాయకుడు ప్రభాకర్ రెడ్డి, ఏడీఏ నరసింహారెడ్డి, ఏఓలు సరస్వతి, శ్యాంబాబు, ఏఈఓలు, వీఏఏలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కాశినాయన : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ యు.సుబ్రమణ్యం అన్నారు. బుధవారం మండలంలోని అన్ని ప్రాథమిక పాఠశాలలను సందర్శించి ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేసే జీవో నెం. 117ను నూతన ప్రభుత్వం రద్దు చేయాలని, తల్లికి వందనం కార్యక్రమాలను కేవలం ప్రభుత్వ పాఠశాలలకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

రైతులకు మెరుగైన సేవలు

జమ్మలమడుగు : మన గ్రోమోర్ ద్వారా రైతులకు నాణ్యమైన ఎరువులను అందిస్తున్నామని మన గ్రోమోర్ ప్రధాన అధికారి నవీన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రొద్దుటూరు రహదారిలో ఉన్న మన గ్రోమోర్‌లో రైతులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వ్యవసాయాధికారి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం నవీన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ వ్యాపారులు రైతులకు మంచి నాణ్యమైన ఎరువులు, విత్తనాలను పంపిణీ చేయడంతోపాటు వారికి మంచి దిగుబడి వచ్చేవిధంగా ఉండాలని సూచించారు.

ఆలయాలకు కొత్త శోభ



శ్రీ నాగేశ్వరస్వామి ఆలయం



ఆలయంలో కొనసాగుతున్న పనులు

రూ.30 లక్షలతో పునఃనిర్మాణ పనులు

చెన్నూరు : మండల కేంద్రమైన చెన్నూరు ట్రంకు రోడ్డులోని శ్రీ నాగేశ్వర స్వామి, శ్రీ లలిత అంబికా దేవి 500 సంవత్సరాల చరిత్ర కలిగిన పురాతనమైన ఆలయాలు కొత్త శోభ సంతరించుకుంటున్నాయి. ప్రతినిత్యం భక్తులతో కళకళలాడుతున్న ఈ ఆలయానికి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు యువత పెద్దలు స్వచ్ఛంద సేవ సంస్థ నిర్వాహకులు ఆలయ అభివృద్ధికి కంకణం కట్టుకున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీగా ఏర్పడి 30 లక్షల రూపాయలు ఖర్చుతో ఆలయాన్ని పునర్ నిర్మాణం పేరుతో పనులు చేపట్టారు. ఆలయం చుట్టూ ప్రహరీ పెంచే ఏర్పాట్లు జరుగుతున్నాయి. అన్నసంతర్పణ కోసం పరిసరాలను సిద్ధం చేస్తున్నారు. మరో రెండు మూడు నెలల్లో ఆలయ నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు కమిటీ నిర్వాహకులు చర్యలు తీసుకుంటున్నారు. కార్తీక, శ్రావణ, మాఘ మాసాల్లో ఆలయం నిత్యం భక్తులతో కళకళలాడుతూ విరాజిల్లుతుంటుంది.

హోటళ్ల యజమానులు పరిశుభ్రత పాటించాలి

ప్రొద్దుటూరు : పట్టణంలోని హోటళ్ల యజమానులు పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి సూచించారు. బుధవారం పట్టణంలోని మైదుకూరు రోడ్డు, శివాలయం రోడ్డులోని హోటళ్లు, బిరియాని సెంటర్లను కమిషనర్ తనిఖీ చేశారు. హోటళ్లలో వంట గదులను, పదార్థాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నిల్వ చేసిన పదార్థాలను ఉపయోగించవద్దని హోటళ్ల యజమానులకు సూచించారు. అపరిశుభ్రత వాతావరణం లేకుండా చూసుకోవాలన్నారు. నిషేధిత ప్లాస్టిక్ వాడకంపై ఆంక్షలు ఉన్నాయని, వాటిని వాడరాదని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నూర్ బాషా, సుబ్బరాయుడు, కిరణ్ పాల్గొన్నారు.

పంట మార్పిడి.. అధిక రాబడి

- రోగకారక కీటకాల కట్టడికి ఎంతో మేలు
- ఒకే తరహా పంటతో నష్టమే
- పంటల మార్పిడితో భూసారం వృద్ధి
- సాగులో వైవిధ్యం చూపితే ప్రయోజనాలు అధికం



పొలంలో ట్రాక్టర్‌తో సేద్యం చేస్తున్న రైతు

రాజుపాళెం : పొలంలో ప్రతిసారి వేసిన పంటనే మళ్లీ వేయడం వలన దిగుబడులు తగ్గడంతో పాటు తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంటుంది. అలా కాకుండా ఏటా పంట మార్పిడి పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఒకే రకం కాకుండా అనేక రకాల పంటలను క్రమపద్ధతిలో సాగుచేస్తే అధిక ప్రయోజనాలు పొందవచ్చని చెబుతున్నారు. పంట మార్పిడి చేయడం ద్వారా ప్రకృతి వనరులను సైతం సమర్థవంతంగా వినియోగించుకోవచ్చు. తక్కువ పెట్టుబడితో భూసారానికి నష్టం కలగకుండా అధిక దిగుబడులు సాధించవచ్చు. తక్కువ పెట్టుబడితో భూసారానికి ఇబ్బంది లేకుండా అధిక లాభం పొందవచ్చు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురుస్తుండడంతో ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న అన్నదాతలు పంట మార్పిడి అవశ్యకతపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంది.

ఒకే తరహా పంట సాగుతో నష్టాలు

- ఏటా ఒకే రకం పంట పండించడం వల్ల చీడపీడలు, కలుపు బెడద ఎక్కువగా ఉంటుంది. పైరు కూడా అభివృద్ధి చెందదు. దిగుబడులు తగ్గుతాయి. రైతులకు పెట్టుబడి భారం పెరుగుతుంది.
- వేరు వ్యవస్థ ఒకే లోతుకు పోవడం వల్ల నేలలో ఆ లోతు వరకు ఉన్న పోషకాలకు మాత్రమే మొక్కలు వినియోగించుకుంటాయి.
- నేల కోతకు గురవుతుంది. పండిన పంట నాణ్యతగా ఉండదు. ఫలితంగా గిట్టుబాటు ధర లభించదు. దీంతో రైతులకు నష్టం వచ్చే అవకాశం ఉంది. మార్కెట్ సమస్యలు కూడా ఎదురవుతాయి. అందుకే వేర్వేరు పంటలను సాగు చేసుకోవాలి.
- ఎక్కువ లోతుకు వేర్లు వెళ్లే పైర్లు, తక్కువ లోతుకు వేర్లు వెళ్లే పైర్లు ఒకదాని తర్వాత ఒకటి సాగు చేయాలి. ఉదాహరణకు జొన్న-పత్తి.
- నేలను నిర్వీర్యం చేసే పంటలను, సారాన్ని అభివృద్ధి చేసే పంటలను ఒకదాని తర్వాత ఒకటి సాగు చేసుకోవాలి.

పంటల మార్పిడితో భూసారం వృద్ధి

- వరి పంట సాగు చేసే ముందు పచ్చిరొట్ట పైర్లు సాగు చేయడం వల్ల భూసారం పెరిగి సేంద్రీయ పదార్థం భూమిలో ఎక్కువగా ఉండటం వల్ల పైరు ఏపుగా పెరుగుతుంది.
- వరి తర్వాత అపరాలు లాంటి పైర్లు సాగు చేయడం వల్ల భూమిలో సేంద్రియ పదార్థం బాగా వృద్ధి చెందుతుంది. దీంతో పంటపై వచ్చే శిలింద్రాల ఉధృతి తగ్గుతుంది.
- వరి తర్వాత గింజ జాతికి చెందిన శనగ, పెసర, మినుము, వేరుశనగ లాంటివి సాగు చేయడం వల్ల వాటి వేర్లలోని రైజోబియన్ బ్యాక్టీరియా గాలిలోని నత్రజనిని తీసుకుంటుంది. వేర్లలో బుడిపెల మాదిరిగా ఏర్పడి తర్వాత సాగు చేసే పంటలకు మంచి సారాన్ని అందిస్తాయి.

పంట మార్పిడితో మంచి దిగుబడులు



ఏటా ఒకే రకం పంట సాగు చేయకుండా పంట మార్పిడితో పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చు. ప్రస్తుతం చాలా మంది రైతులు తమ పొలాల్లో ఒకే రకం పంటను తరచూ సాగు చేస్తున్నారు. నీటి పారుదల ఉన్న చోట వరి తప్ప ఇతర పంటలు వేయడం లేదు. దీంతో వరిలో చీడపీడల బెడద ఎక్కువై సాగు ఖర్చులు పెరుగుతున్నాయి. దీన్ని నివారించుకునేందుకు పంట మార్పిడి విదానం చాలా ఉత్తమం. రైతులంతా విధిగా పంట మార్పిడి చేపట్టాలి.

- శివరామ కృష్ణారెడ్డి, వ్యవసాయాధికారి, రాజుపాళెం మండలం

డ్రైనేజీలలో పూడికతీత



కొత్తగాంధీనగర్‌లో డ్రైనేజీ పూడికతీత పనులను పరిశీలిస్తున్న కార్యదర్శి రామసుబ్బారెడ్డి

చెన్నూరు : చెన్నూరు పంచాయతీ పరిధిలోని అరుంధతీనగర్, కొత్త గాంధీనగర్, బెస్త కాలనీ, సరస్వతీ నగర్, లక్ష్మీనగర్‌లలోగల డ్రైనేజీలో ప్లాస్టిక్ వ్యర్థాలు, మట్టితో పూడుకుపోయి వర్షపు నీరు వెళ్లకపోవడంతో స్థానిక ప్రజల ఫిర్యాదు మేరకు బుధవారం పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి ఆయా కాలనీలలో పర్యటించారు. డ్రైనేజీలను పరిశీలించడమే కాకుండా, వెంటనే గ్రామ పంచాయతీ సిబ్బందితో డ్రైనేజీలను డ్రైనేజీల ఉన్న పూడికను తీయించారు. ఎక్కడైనా ఏవైనా పారిశుద్ధ్యంకు సంబంధించిన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని ఆయన తెలియజేశారు.

నేడు వేలంపాట

చెన్నూరు : చెన్నూరు గ్రామపంచాయతీకి సంబంధించి 2024- 2025 సంవత్సరానికిగాను బస్టాండ్, కూరగాయల మార్కెట్, జంతు వధ శాలతోపాటు గ్రామ పంచాయతీకి సంబంధించిన రూములకు గురువారం వేలం పాట నిర్వహించనున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి రామ సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచ్ సిద్ధిగారి వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో మధ్యాహ్నం మూడు గంటలకు గ్రామపంచాయతీ కార్యాలయంలో ఈ వేలంపాట నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.